జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 06-09-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 776 పేజీలు: 4 వెల : రూ.7

# ప్రోటోకాల్ ఎక్కడ?

* ఎమ్మెల్యే సాక్షిగా తిలోదకాలు
* తెలుగు రైతు అధ్యక్షులకు స్టేజీపై చోటేది?
* పార్టీ కోసం పనిచేసిన వారికి ఇదేనా గౌరవం?
* పారాపురం రైతుల సభలో తెలుగు తమ్ముళ్ల గుసగుసలు



కొత్తూరు,సెప్టెంబర్ 5 (వార్త): కొత్తూరు మండలంలోని పారాపురం పంచాయతీలో జరిగిన రైతు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమం కేవలం ఒక ప్రభుత్వ అధికారిక కార్యక్రమంగానే కాకుండా, తెలుగుదేశం పార్టీలోని అంతర్గత సమన్వయ లోపాలకు అద్దం పట్టే వేదికగా మారింది. ఎమ్మెల్యే సమక్షంలోనే నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులకు ఎద్దు సంతోష్, కొత్తూరు మండల తెలుగు రైతు అధ్యక్షులకు పైల లక్ష్మణరావులను వేదికపై కనీసం స్థానం దక్కకపోవడం పార్టీ శ్రేణుల్లో తీవ్ర చర్చకు, అంతర్గత అసంతృప్తికి దారితీసింది. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం నిరంతరం శ్రమించే అనుబంధ సంఘాల నాయకులకు తగిన గుర్తింపు లభించకపోవడంపై వస్తున్న విమర్శలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

## రైతు వేదికపైనే రైతు నేతలకు విస్మరణ...

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించి రైతుల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమం ఇది. సరిగ్గా ఇదే వేదికపై రైతుల సమస్యలపై గళం ఎత్తాల్సిన 'తెలుగు రైతు' సంఘం బాధ్యులను పూర్తిగా విస్మరించడం గమనార్హం. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పదవులు లేదా తగిన గౌరవం కోసం ఎదురుచూసే నాయకులకు ఇలాంటి అవమానాలు ఎదురుకావడం కేడర్‌ను నైతికంగా కుంగదీస్తుంది. "రైతుల కోసమే ప్రత్యేకంగా నిర్వహించిన కార్యక్రమంలో, రైతు విభాగం ప్రధాన బాధ్యులకు వేదికపై చోటు లేకపోతే ఇక మరెక్కడ ఉంటుంది?" అనే ప్రశ్న పార్టీ శ్రేణుల నుంచి గట్టిగా వినిపిస్తోంది. ఈ ఘటన వెనుక అధికారుల నిర్లక్ష్యం ఉందా లేక స్థానిక నాయకుల ఉద్దేశపూర్వక జోక్యం ఉందా అనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది.

అధికారంలో ఉన్నామనే ధీమాతో కొందరు ప్రోటోకాల్ నిబంధనలను పూర్తిగా గాలికొదిలేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కేవలం కొద్దిమంది నేతల కనుసన్నల్లోనే కార్యక్రమాలు నడవడం, కిందిస్థాయి ప్రజాప్రతినిధులు, సంఘాల అధ్యక్షులను కనీసం ఆహ్వానించకపోవడం వల్లనే ఇలాంటి పొరపాట్లు పునరావృతమవుతున్నాయి. ఎమ్మెల్యే సాక్షిగా జరిగిన ఈ ప్రోటోకాల్ వైఫల్యంపై కనీసం పక్కన ఉన్న నాయకులు కూడా స్పందించకపోవడం గమనార్హం. అధికార పార్టీలో ఇలాంటి చిన్న చిన్న ప్రోటోకాల్ వివాదాలు రాబోయే రోజుల్లో పెద్ద చిచ్చుపెట్టే ప్రమాదం ఉంది. కష్టకాలంలో పార్టీని అంటిపెట్టుకుని పనిచేసిన అనుబంధ సంఘాల నాయకులను ఇలా పక్కన పెడితే, భవిష్యత్తులో ఎన్నికల సమయాల్లో క్షేత్రస్థాయి యంత్రాంగం నుంచి సహకారం కరువయ్యే అవకాశం ఉంది. నాయకుల మధ్య సరైన సమన్వయం లేకపోవడం, కేడర్ మనోభావాలను గుర్తించడంలో స్థానిక నాయకత్వం విఫలమవడం పార్టీకి నష్టం చేకూరుస్తుంది. ఈ ఘటనపై స్థానిక నాయకత్వం, పార్టీ పెద్దలు ఏవిధంగా స్పందిస్తారనే దానిపైనే కొత్తూరు నియోజకవర్గ రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంది. దీన్ని కేవలం ఒక సాధారణ ప్రోటోకాల్ అని పొరపాటుగా కొట్టిపారేయకుండా, భవిష్యత్తులో ఇలాంటి పునరావృతం కాకుండా సరిదిద్దుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




# శిలా ఫలకం.. కాకెత్తుకు పోయిందా?

* ఉదయం ఆవిష్కరించిన కేంద్ర మంత్రి.. సాయంత్రానికి మాయం * శిలాఫలం ఆవిష్కరణ ప్రాంతాన్ని పరిశీలించిన వైసీపీ నాయకులు



ఇచ్ఛాపురం, సెప్టెంబర్5 (వార్త): ఎంతో అట్టహాసంగా ప్రతిష్టాత్మంగా పండుగ వాతావరణంలో సాక్షాత్తు కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శుక్రవారం ఆవిష్కరణ చేసిన శిలా ఫలకం సాయంత్రానికి కనిపించకుండా పోయింది. ఇదే ఇప్పుడు ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో పెద్ద హాట్ టాపిక్ అయ్యింది. కోల్ ఇండియా సౌజన్యం తో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కింద సుడా ఆధ్వర్యంలో సుమారు 2 కోట్ల రూపాయలతో చేపట్టనున్న ఇండోర్ స్టేడియం పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాళం అశోక్ కూడా పాల్గొన్నారు. ఆ శిలా ఫలకం సాయంత్రం నుంచి కనపడడం లేదు. దీంతో వైస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్‌లు ఆ శిలాఫలకం ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. అదే విధంగా అక్కడే 2018లో ఎమ్మెల్యే అశోక్ వేసిన క్రీడా వికాస కేంద్రం శిలా ఫలకం కూడా శిథిలావస్థకు చేరింది.



# ధర్మానను విమర్శించే స్థాయి గొండుకు లేదు

* అవినీతికి కేరాఫ్ అడ్రస్ శంకర్
* నేషనల్ హైవేలో పనిచేసే వ్యక్తికి ఎక్కడనుంచి కోట్లు వచ్చాయి
* ఇసుక, మట్టి తవ్వకాలపై సమగ్ర విచారణ జరపాలి
* ఎమ్మెల్యే గొండు తీరుపై వైసీపీ నేతలు ధ్వజం

శ్రీకాకుళం, సెప్టెంబర్5 (వార్త): మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నాయకుడు ధర్మాన ప్రసాదరావును విమర్శించే హక్కు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ లేదని శ్రీకాకుళం నియోజకవర్గ వైసీపీ నేతలు అన్నారు. శంకర్ అవినీతి బాగోతం మొత్తం మా దగ్గర ఉందని సమయం వచ్చినప్పుడు ఒక్కొక్కటిగా బయటపెడతామని హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి రథసారథి ధర్మానను విమర్శించే ముందు మీ పనితీరు చూపించాలంటూ గొండు శంకర్‌కు సవాల్ విసిరారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో శనివారం పార్టీ రాష్ట్ర వెలమ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మూకుళ్ల తాతాబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి తదితరులు మీడియాతో మాట్లాడారు. ధర్మాన ప్రసాదరావుపై ఎమ్మెల్యే గొండు చేసిన ఆరోపణలు ఖండించారు. వచ్చిన రెండేళ్లలోనే అభివృద్ధి ముసుగులో అవినీతి పాల్పడుతున్న శంకర్ బాగోతం ప్రజలకు తెలుసన్నారు. ఎమ్మెల్యే అనుచరులు నైరా, బూరవెల్లి, గార తదితర రీచ్‌లలో జరుగుతున్న తవ్వకాలపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. హైదరాబాద్, విజయవాడ నుంచి వచ్చిన కొందరు వ్యక్తులు ఎమ్మెల్యేకు డబ్బులు ఇచ్చి రీచ్‌లు తెరిపించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయని, వీటిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. చెరువుల్లో జేసీబీలు, ట్రాక్టర్లు, లారీలతో మట్టి తవ్వి తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. హైవే పక్కనున్న పెద్దపాడు చెరువులో జరుగుతున్న పనులను అధికారులు పరిశీలించాలని కోరారు. ప్రతి వ్యవహారంలో మధ్యవర్తిత్వం చేస్తూ, లంచాల కోసం ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని విమర్శించారు. ఒక వృద్ధురాలు ఆస్తి వ్యవహారంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఘటనను ప్రస్తావిస్తూ.. బాధితులకు అండగా నిలవాల్సిన ప్రజాప్రతినిధిపై మధ్యవర్తిత్వం, డబ్బులు తీసుకునే ప్రయత్నం చేశారని గొండుపై ఆరోపణలు వచ్చాయన్నారు. ఎమ్మెల్యేపై వస్తున్న ఆరోపణలపై తాము నిరంతరం ప్రజల్లోకి వెళ్తామని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి అక్రమంలోనూ ఎమ్మెల్యే జోక్యం చేసుకుని కాసులు దండుకుంటున్నారని విమర్శించారు. లేఅవుట్ల వద్ద కమీషన్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు, మత్స్యకారులకు సంబంధించిన నిధుల వ్యవహారంపై ఫిర్యాదులు ఉన్నాయన్నారు. ఇక నుంచి గొండు శంకర్ కాదు.. లంచగొండి శంకర్ అని పిలుస్తామని వ్యాఖ్యనించారు. ఈ సమావేశంలో వైసీపీ నేతలు ఎన్ని ధనుంజయ్, కోణార్క్ శ్రీను, శిమ్మ రాజశేఖర్, మెంటాడ స్వరూప్, రవి, శ్రీను పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# రామూ.. మాటల గారడీయే.. చేతలేవీ?

## క్యాన్సర్ బాధిత విద్యార్థికి సిక్కోలు ఉద్దానం సేవాసమితి ఆర్థికసాయం



**మందస, సెప్టెంబరు 5(వార్త):** బుడారిసింగి గ్రామానికి చెందిన సారక శశికుమార్ బ్లడ్ క్యాన్సర్‌తో బాధ పడుతున్నాడు. మందసలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ప్రథమ సంవత్సరంలో 446 మార్కులు వచ్చాయి. చదువులో తెలివైన విద్యార్థిగా కాలేజీలో పేరు తెచ్చుకున్నాడు. తండ్రి చిన్నతనంలోనే మరణించడంతో తల్లి ఎంతో కష్టపడి పెంచి పోషిస్తూ.. చదివిస్తోంది. ఈ తరుణంలో శశికుమార్‌కు బ్లడ్ క్యాన్సర్ సోకింది. ప్రస్తుతం శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆయన చికిత్సకు రూ.లక్షల్లో ఖర్చు అవుతుంది. ఈ విషయం తెలుసుకున్న సిక్కోలు ఉద్దానం సేవా సమితి ప్రతినిథులు శశికుమార్ కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఇప్పటికే శశికుమార్‌ను ఆదుకోవడానికి తోటి విద్యార్థులు గ్రామ గ్రామాల్లో తిరుగుతూ సహాయం చేయాలని విరాళాలు సేకరిస్తున్నారు. కార్యక్రమంలో సిక్కోలు ఉద్దానం సేవా సమితి సభ్యులు రంజిత్, విశ్వనాథం, దామోదర్, ప్రవీణ్, చైతన్య, జగదీష్ పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాల్లో పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు



**మందస, సెప్టెంబరు 5(వార్త):** సాబకోట పంచాయతీలో గల గిరిజన గ్రామాల్లో శనివారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. బుడంబోకాలనీ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో సింగుపురం ఎంపీపీ పాఠశాలలో, సాబకోట ఎంపీపీ పాఠశాలలో ప్రత్యేకంగా నేత్ర వైద్య శిబిరాలను జిల్లా అంధత్వ నివారణ సంఘం చైర్మన్ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలు ప్రకారం పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది. సింగుపురంలో 70 మంది విద్యార్థులు, సాబకోటలో 30 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలను మందస మండల నేత్ర వైద్య సహాయాధికారి రోణంకి వెంకటరమణ నిర్వహించారు. విద్యార్థులకు ఎటువంటి దృష్టి లోపాలు లేవని ఆయన తెలిపారు. నేత్ర సంరక్షణపై అవగాహన కల్పించామన్నారు. మొబైల్ ఫోన్ వినియోగానికి విద్యార్థులు దూరంగా ఉండాలని, విటమిన్ ఎ ఎక్కువగా లభించే అహరశీ తీసుకోమని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో సింగుపురం హెచ్‌ఎం ఎన్.అరుణ, సాబకోట హెచ్‌ఎం బి.పాణిగ్రహి, ఉపాధ్యాయులు, ఆశ లక్ష్మి, బిసోయి, వై.మల్లి పాల్గొన్నారు.

## పొత్తంగి-సిరిపురంలో ఉపాధ్యాయ దినోత్సవం




**మందస, సెప్టెంబరు 5(వార్త):** పొత్తంగి-సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి, ప్రముఖతత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.తారకేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఉపాధ్యాయుడు కేవలం పాఠ్యాంశాలను బోధించే వ్యక్తి మాత్రమే కాకుండా, విద్యార్థులకు మంచి విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని నేర్పించే మార్గదర్శి అని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల సేవలు ఎంతో విలువైనవని తెలిపారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ ఎ.సుజాత పాల్గొని ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

## గురువులను గౌరవించడం ప్రతీ ఒక్కరి బాధ్యత

**మందస, సెప్టెంబరు 5(వార్త):** నేటి సమాజం లో విద్యార్థులు అందరూ సత్ప్రవర్తన కలిగి ఉంటూ, గురువులను విధిగా గౌరవించాలని వక్తలు కోరారు. మందస మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కూన వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాన్ని ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, సిబ్బంది పూలమాలతో సత్కరించిన అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాల విద్యార్థులు ఆయా ఉపాధ్యాయులకు పలు ఆటలు పోటీలు నిర్వహించారు. గెలుపొందినవారికి బహుమతి ప్రదానం చేశారు. మాజీ సర్పంచ్ ప్రతినిధి, పోలీస్ ఉద్యోగి సేనాపతి మురళి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సిబ్బందికి చిరు కానుకలు అందిస్తూ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం గొప్పతనం పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.భీమారావు, జి.జానకమ్మ, ఎం.లక్ష్మణరావు, ఎ.అప్పారావు, బి.పాపమ్మ, ఎం.చిత్రసేను, జి.సూర్యనారాయణ, జి.చిన్నికృష్ణ, ఎం.దామోదరం, జి.గోపాలకృష్ణ, బి.రమేష్, పి.అఖిల, విద్యార్థులు పాల్గొన్నారు



- ఇచ్ఛాపురం రుణం తీర్చుకోండి కేంద్ర మంత్రి వర్యా..!
- వైస్సార్సీపీ సమన్వయ కర్త శ్యాంప్రసాద్ రెడ్డి



**ఇచ్ఛాపురం సెప్టెంబరు 5 (వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గం కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడును, ఆయన తండ్రి దివంగత ఎర్రనాయుడును మిక్కిలి ఆదరించిందని, అందుకు రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని వైసీపీ సమన్వయకర్త సాడి శ్యామ్ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఇచ్ఛాపురంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణాష్టమి రోజున కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి, కింజరాపు రామ్మోహన్ నాయుడు పర్యటన అసాంతం "ఆత్మస్తుతి పరనింద" పద్ధతి అనుసరించారే తప్ప ప్రజల అవసరాలు పరిష్కరించినట్టుగా గానీ, హామీలు అమలు చేస్తున్నట్టు గానీ స్పష్టత తీసుకొని రాలేకపోయారన్నారు. ఎటువంటి సమస్యలైనా పరిష్కరించబడిపోతాయన్న ప్రజల విశ్వాసాన్ని, నమ్మకాన్ని రామ్మోహన్ నాయుడు నిలబెట్టలేకపోయారన్నారు. కొలిగాం రోడ్‌లో లెవెల్ క్రాసింగ్ వద్ద "రైల్ ఓవర్ బ్రిడ్జ్" మాత్రమే ట్రాఫిక్ కష్టాలు తీర్చగలదని, రైల్ ఓవర్ బ్రిడ్జ కావాలి మొర్రో అని ప్రజలు అడిగితే "రైల్ అండర్ బ్రిడ్జ శంకుస్థాపన చేసేశాం... పండగ చేసుకోండి" అన్నట్టుగా చేసే హడావిడి ప్రజల కష్టాలను ఏ మేరకు తీర్చగలదు అన్న ప్రజల ప్రశ్నకు తమ సమాధానమేమి మంత్రి గారు అని ప్రశ్నించారు.

– ఎం.తోటూరు వద్ద రైల్ అండర్ బ్రిడ్జ్‌కి శంకుస్థాపన చేస్తూ 50 కోట్లుతో రైల్ ఓవర్ బ్రిడ్జ్ కోసం నిధులు మంజూరయ్యావి దాన్ని కూడా చేపట్టేస్తాం అన్నది సత్యదూరమైన మాటలు కాదా?అని ప్రశ్నించారు.

– "ఏదో తాత్కాలికంగా ఇచ్చేసారు. ఇంకెక్కడి అర్ ఓ బి అన్న ప్రజలు అనుమానాలను నివృత్తి చేయగలిగే సానుకూల, సాంకేతిక స్పష్టత ఇవ్వలేకపోయారని ప్రత్యామ్నాయం గానే చూస్తున్నారు తప్ప ఒకేచోట రెండు సానుకూలపడగలవని ప్రజలు భావించడం లేదని, దీనిపై స్పష్టత కొరవడిందన్నారు. తూర్పు తీరంలో ఇచ్ఛాపురానికి 50 కిలోమీటర్ల దూరంలో మూలపేట పోర్ట్ ఉందని, ఇచ్ఛాపురం సరిహద్దు ఒడిశా సున్నాపూర్ వద్ద ఒక సీపోర్ట్ నిర్మాణానికి అనుమతులు పొంది ఉండగా మళ్లీ ఈ నియోజకవర్గం లో సీపోర్ట్ కట్టేస్తామని చెప్పడం పిట్టలదొరని గుర్తుకు తెస్తోందని ఎద్దేవా చేశారు.

– ఇచ్ఛాపురంలోకి రావడానికి బాహుదా నదిపై బ్రిడ్జ్ కూలిన చోట కొత్త బ్రిడ్జ కట్టడానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మంజూరు చేసిన 20 కోట్లు నిధులు పునరుద్ధరించి బ్రిడ్జ్ నిర్మాణాం చేపట్టలేని వారు తీరంలో పోర్ట్ కట్టేస్తామంటే నమ్మే అమాయకులు.. ఈ నియోజకవర్గ ప్రజలనేగా తమ అభిప్రాయం అన్నారు.

– తీర ప్రాంత మత్స్యకారుల ఆరోగ్య అవసరాలకోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోంపేట మండలం బారువాలో 30 పడకల ఆసుపత్రికి రూ.6.55 కోట్లతో నూతన భవన నిర్మాణం కోసం మంజూరు చేస్తే దానిని పూర్తి చెయ్యలేని వారు తమరన్నారు.

– కోల్ ఇండియా సీఎస్ఆర్ నిధులతో చేపట్టే క్రీడా స్థలాల అభివృద్ధి, ఇండోర్ స్టేడియం క్రీడాభివృద్ధి పనులు తమ కూటమి ఘనతగా చెప్పుకోవడం అనేది నెవ్వర్ బిఫోరు, ఎవ్వర్ ఆఫ్టర్ అని వ్యంగ్యంగా వ్యాఖ్యనించారు.

– మీ మిత్రుడు మా హేట్రిక్ ఎంఎల్ఏ బెందాళం అశోక్ సర్వశిక్షాఅభియాన్ నిధులు రూ.2కోట్లతో చేపడుతున్నామన్న క్రీడా వికాస కేంద్రమేమైంది మంత్రి గారు?, ఆ శంకుస్థాపన ఫలకం చెట్ల నీడలో కనపడకుండా ఉందని ప్రశ్నించారు. ( శిలాఫలకం 2018 లో వేసి ఉంది ).

– ఇచ్ఛాపురం క్రీడా ప్రాంగణం అభివృద్ధి అని చెప్పి వెన్నుపోటు పార్టీ ప్రతి ఎన్నికల ముందు ఒక రాయి వేసిన శిలాఫలకాలతో, అవి వెయ్యడానికి చేసిన ప్రభుత్వ ఖర్చుతో ఒక ఇండోర్ స్టేడియమే కట్టొచ్చు కానీ అక్కడ వేసిన పునాదిపై ఒక్క రాయి కూడా వెయ్యకుండా ఉంచిన మొండి పునాదులు మీకు కనిపించడం లేదా మంత్రిగారూ?అని అన్నారు.

– వైస్సార్సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్రయాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయదారుల సాగు పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఇచ్ఛాపురం నియోజకవర్గం రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. రెండు నదులు ఈ నియోజకవర్గంలో ప్రవహిస్తున్నా నికర జలాలు అందించడంలో వెన్నుపోటు పార్టీ ప్రతినిధులు నిర్లక్ష్యం తమ ప్రజలకు శాపం అన్నారు. బాహుద నికర జలాల 5 టీఎంసీ వినియోగంలో ఒడిశా 3.5, ఆంధ్రప్రదేశ్ 1.5 ఉభయ రాష్ట్రాల ముఖ్య మంత్రుల ఒప్పందాన్ని అమలు కోసం ఏమైనా ప్రయత్నం చేశారా? ఆ ఒప్పందం అమలు జరిగి ఉంటే ఈ ఏడాది కరువు పరిస్థితిలో ఒడిశాలో కురిసిన వర్షాల నీరు ఇచ్ఛాపురం రైతాంగానికి ఉపయోగపడేది. దాని గురించి మాట్లాడలేదేం మంత్రి గారూ అన్నారు.

– కంచిలి ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి మాట్లాడుతూ రోడ్లు లేని ప్రాంతాలకు కూడా రోడ్లు వేసేస్తున్నామని చెబుతున్నారే..... 2019 ఎన్ని కల్లో లబ్ధి కోసం ఎన్నికలకు కొద్దిగా ముందు 2018 నవంబర్, 2019 ఫిబ్రవరి లో వేసిన రోడ్‌ల శిలాఫలకాల ప్రగతి ఏమైంది? ఎటువంటి అనుమతులు మంజూరులు లేకుండా కేవలం ఓట్లు లబ్ది కోసం ఏఐఐబీ నిధులు అని చెప్పి వేసిన రోడ్ల శిలాఫలకాలు సమాధి రాళ్ల వలే వెక్కిరిస్తున్నాయన్నారు. గడచిన 30 సంవత్సరాల్లో 25 సంవత్సరాలు వెన్నుపోటు పార్టీ నుంచి మీరు మీ తండ్రి గారే ఈ నియోజకవర్గానికి లోక్ సభ ప్రతినిధులన్నారు. ఎంపీగా పోటీ చేసిన ప్రతి ఎన్నికల్లో... ఇచ్ఛాపురం ఏసెంబ్లీ వెన్నుపోటు పార్టీ అభ్యర్థి కన్నా మీకు అదనంగా ఓట్లు వచ్చిన సంగతి మీకు తెలుసనని. మీకు ఓట్లేసిన ప్రజలకు కూడా తెలుసు. మీ తండ్రి ఎంపీగా ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన కొబ్బరి చెట్టు గుర్తుకు కాంగ్రెస్ పార్టీకి సమానంగా ఓట్లేసిన ఇచ్ఛాపురం ప్రజల అభిమానం చూపిన నియోజకవర్గానికి మీరు చేసిన మౌలికమైన అభివృద్ధి ఏమిటీ? ఆకర్షనీయమైన మాటలు తప్ప గుణత్మకమైన ప్రగతి కి ప్రయత్నాలు చెయ్యలేదన్నారు. ఒక్క అదనపు ఎకరాకు సాగునీరు అందించారా?, తలసరి ఆదాయం పెంచారా?, వలసలని ఆపే ఉపాధి కల్పన చేశారా?, కిడ్నీ, కాన్సర్ వ్యాధులతో క్రుంగిపోతున్న ఉద్దానం మానవవనరుల వృద్ధికి క్రియశీలంగా ఏమైనా చేశారా?, ఇచ్ఛాపురం గడ్డ తెలుగు దేశం అడ్డా అంటూ ఇచ్ఛాపురం నడ్డి విరిచిన వెన్నుపోటు పార్టీ తమది అన్నారు. మరోసారి ఇచ్ఛాపురం నియోజకవర్గం పర్యటన కు వచ్చినప్పుడు ఈ విషయాలన్నీ గుర్తులో పెట్టుకొని సహేతుకమైన సమాధానాలతో, క్రియశీల పరిష్కరాలతో శ్యాంప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఉలాల భారతీ దివ్య, ఇచ్ఛాపురం ఎంపీపీ బోర పుష్ప, కంచిలి జడ్పీటీసీ ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావు, రాష్ట్ర మున్సిపల్ విభాగం కార్యదర్శి సుగ్గు ప్రేమ్ కుమార్, జిల్లా పార్టీ సంయుక్త కార్యదర్శి ఆశి పురుషోత్తం రెడ్డి, బర్ల నాగ భూషణ రెడ్డి, మాజీ సర్పంచ్ గణప సింహాచలం సాలినగాంధీ, కారింగి మోహా నరావు, నీలాపు ఢిల్లీ, డొక్కరి హేమరాజు, బాలరాజు కాళ్ళ తేజ, శ్రీకాంత్ గౌడో, జిల్లా సాంస్కృతిక విభాగం కార్యదర్శి సాడి దుర్యోధన రెడ్డి, కీలు ఉమా శంకర్, సాడి జయరాం రెడ్డి, కొయ్య గోపాల్, ఈగల దేవదాసు, కార్యాలయ కార్యదర్శి ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా కన్నారావు పదవీ ప్రమాణ స్వీకారం

- అరసవల్లి తరలిన టీడీపీ శ్రేణులు
- అభినందనలు తెలిపిన అధ్యక్షుడు బావన దుర్యోధన, ముఖ్య నాయకులు

**మందస, సెప్టెంబరు 5(వార్త):** శ్రీకాకుళం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులుగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మండల పరిషత్ మాజీ అధ్యక్ష ప్రతినిధి కొర్ల కన్నారావు నియమితులయ్యారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన దేవాలయం, ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులుగా మందస మండలం కు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ వ్యాపారవేత్త కొర్ల కన్నా రావు నియమితులై, శనివారం జిల్లా అతిరథ మహారధులైన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి గౌతు శ్యామసుందరశివాజీ, శ్రీకాకుళం శాసనసభ్యుడు గొండు శంకర్, జనసేన జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ సమక్షంలో అత్యంత వైభవంగా ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. కొర్ల కన్నారావు ఎంతో భక్తి, శ్రద్ధలు కలిగిన నాయకుడని, సామాజిక సేవలో ముందుంటారని, ఈ పవిత్రమైన బాధ్యత దక్కడం మన ప్రాంత వాసులందరికీ గర్వకారణమని తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన అన్నారు. సూర్య భగవానుని ఆశీస్సులతో ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల కల్పనకు వారు మరింత కృషి చేస్తారని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. కూటమి ప్రభుత్వం, పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష, జిల్లా కూటమి పెద్దలు, భక్తుల మనోభావాలకు, ఆలయాల పవిత్రతకు పెద్దపీట వేస్తూ ఇలాంటి భక్తి కలిగిన వ్యక్తులను నియమించడం హర్షణీయమన్నారు. కొర్ల కన్నారావు, కుటుంబ సభ్యులకు మందస మండల తెలుగుదేశం పార్టీ కుటుంబం తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. స్వామివారి కృపా కటాక్షాలు వారిపై ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి, మందస మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు రామారావుకు కమిషనర్ అభినందన

- విజయవాడలో ప్రత్యేకంగా అభినందించిన తమీమ్ అన్సారియా
- ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మరింత కృషి చేయాలని సూచన
- కమిషనర్ అభినందన ఎంతో ఆనందాన్నిచ్చిందన్న రామారావు



**జలుమూరు, సెప్టెంబరు 5 (వార్త):** జలుమూరు మోడల్ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడు మెండ రామారావు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన నేపథ్యంలో శనివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించింది. విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా రామారావును అభినందించి, ఆయన విద్యారంగానికి అందిస్తున్న సేవలను ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని ఈ సందర్భంగా కమిషనర్ సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో మరింత కృషి చేయాలని రామారావుకు సూచించినట్లు తెలిసింది. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం తనకు ఎంతో గర్వకారణమని మెండ రామారావు తెలిపారు. విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా స్వయంగా తనను అభినందించడం మరింత ఆనందాన్ని కలిగించిందన్నారు. ఈ గుర్తింపు భవిష్యత్తులో మరింత బాధ్యతతో పనిచేసేందుకు ప్రోత్సాహాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. జలుమూరు మండలానికి చెందిన ఉపాధ్యాయుడు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపిక కావడం పట్ల పలువురు విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా మాధవి

- జలుమూరు మండలానికి దక్కిన అరుదైన గౌరవం
- ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారుల నుంచి పురస్కారం
- అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందన్న ఉపాధ్యాయురాలు

**జలుమూరు, సెప్టెంబరు 5 (వార్త):** టెక్కలిపాడు పంచాయతీ పరిధిలోని గొల్లపేట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న గుండ మాధవి ఉత్తమ జిల్లా ఉపాధ్యాయురాలిగా ఎంపికై పురస్కారం అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమెకు ఈ గౌరవం లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) ఎ. రవిబాబు సమక్షంలో గుండ మాధవి సతీసమేతంగా ఉత్తమ ఉపాధ్యాయురాలి పురస్కారాన్ని అందుకున్నారు. పాఠశాల విద్యాభివృద్ధి, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంలో ఆమె చేస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిసింది. జిల్లా స్థాయి పురస్కారం అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని గుండ మాధవి తెలిపారు. ఈ అవార్డు తనకు సంతోషాన్ని అందించడంతో పాటు మరింత బాధ్యతను పెంచిందన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల అభివృద్ధి కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. గుండ మాధవి సాధించిన ఈ ఘనతపై తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు అభినందనలు తెలిపారు. జలుమూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలికి జిల్లా స్థాయిలో గుర్తింపు రావడం మండలానికి గర్వకారణమని పలువురు పేర్కొన్నారు.



## స్వాతంత్ర్య సమరంలో అల్లూరి పాత్రను మరువలేం

- కంబాలరాయుడుపేటలో ఘనంగా సీతారామరాజు విగ్రహావిష్కరణ

**పలాస, సెప్టెంబరు 5 (వార్త):** స్వాతంత్ర్య సమరంలో అల్లూరి పోషించిన పాత్రను మరువలేమని సీమెన్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కంబాలరాయుడుపేట సీమెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాల ఆవరణలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఘనంగా ఆవిష్కరించారు. గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు, మహిళలు, సీమెన్ అసోసియేషన్ సభ్యుల సమక్షంలో పది అడుగుల నిలువెత్తు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్య సమరంలో పోషించిన పాత్రను, గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం చేసిన పోరాటాన్ని, ఆయన త్యాగాలను పలువురు స్మరించుకున్నారు. పాఠశాల ఆవరణలో అల్లూరి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థుల్లో దేశభక్తి, స్వాతంత్ర్య సమరయోధుల పట్ల గౌరవభావం పెంపొందుతుందని గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు తెలిపారు. విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన సీమెన్ అసోసియేషన్ సభ్యులు లండ సాంబమూర్తి, గణగల్ల వెంకటేష్, గండుపల్లి దుర్వాసులు, గుంటు భాస్కరరావు, దుమ్ము రాంబాబు సూరి, కానమ్మగారి లింగరాజు, గండుపల్లి అప్పన్న, మూగి సురేష్, కంబాల అశోక్, కంబాల వల్లభరావు, వారిది మహేష్, మూగి రాజేష్, కంబాల మధు, మూగి రాజేష్ జంగమయ్య, లండ మహేష్, కంబాల ప్రసన్నకుమార్, వాసుపల్లి రాజేష్, కొండ మధురాజు, వంక హేమసుందరరావు, గరికిని రాజు ఎల్లయ్య, వంక చంద్రశేఖర్‌లను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో యూత్ ఐకాన్ లండ చైతన్య, శ్రీ పాండురంగ సోదర సంఘం అధ్యక్షుడు తోలాడ గురునాథం, కార్యదర్శి దాసరి విఘ్నేష్, మాజీ సర్పంచ్ వంక చిరంజీవి, గుంటు రామారావు, గండుపల్లి గురుమూర్తి, ఉప్పాడ గంగరాజు, దుమ్ము రాములు, ఉప్పాడ రవి, అంబటి శ్రీనివాస్, బడే ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.





జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



# పలాస ప్రజల గుండెల్లో అప్పయ్యదొర

**-13వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు**

**-విగ్రహానికి పూలమాల వేసిన**

**మాజీ మంత్రి అప్పలరాజు**



**పలాస, సెప్టెంబరు 5 (వార్త):** ప్రజా సేవకే జీవితాన్ని అంకితం చేసిన దివంగత హనుమంతు అప్పయ్యదొర సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. అప్పయ్యదొర 13వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కేటీ రోడ్డులోని ఆయన విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన అప్పలరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా



ఆయన మాట్లాడుతూ సాధారణ న్యాయవాదిగా జీవితాన్ని ప్రారంభించిన అప్పయ్యదొర ప్రజా సమస్యలపై పోరాటంతో రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. బెండి గ్రామ సర్పంచిగా ప్రజలకు చేరువైన ఆయన అనంతరం ఎమ్మెల్యేగా, శ్రీకాకుళం ఎంపీగా సేవలందించారని గుర్తుచేశారు. పదవుల కంటే ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చిన ఆయన వ్యక్తిత్వం నేటి తరానికి ఆదర్శమన్నారు. ఉద్దానం ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన ఆఫ్షోర్ రిజర్వాయర్ సాధన కోసం అప్పయ్యదొర ఢిల్లీ స్థాయిలో చేసిన కృషి, పార్లమెంటులో వినిపించిన గళం మరువలేనిదని అన్నారు. పలాస, టెక్కలి, ఉద్దానం ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ఆయన వేసిన పునాదులు గుర్తుండిపోతాయన్నారు. నిజాయితీ, నిబద్ధతతో ప్రజా జీవితంలో కొనసాగిన ఆయన దశాబ్దాలు గడిచినా ప్రజల గుండెల్లో నిలిచారని తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని అన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు మాట్లాడుతూ.. పలాస అభివృద్ధిలో అప్పయ్యదొర పాత్రను విస్మరించలేమన్నారు. పార్లమెంటులో కళింగ సీమ ప్రజల సమస్యలను బలంగా వినిపించిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అధికారం కోసం కాకుండా ఆశయ సాధన కోసం పనిచేసిన అప్పయ్యదొర చూపిన నిజాయితీ, ప్రజా సేవా మార్గం నేటి నాయకులకు ఆదర్శమన్నారు. యువత ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పట్టణ ప్రముఖులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై అప్పయ్యదొరకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హనుమంతు వెంకట్రావు దొర, హనుమంతు విజయ్‌కుమార్ దొర (చిట్టి), జనసేన నాయకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, టీడీపీ నేత దువ్వాడ శ్రీకాంత్, వైఎస్సార్‌సీపీ పలాస పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి, జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, పట్టణ నాయకులు సనపల సింహాచలం, కంచరాన చినబాబు, బమ్మిడి సంతోష్, రోణంకి వెంకటరమణ, డి.నాగభూషణరావు, వల్లభ వైకుంఠరావు, మర్రి బాబురావు, పైడి బాల ప్రభాకర్‌రావు, పి.లక్ష్మణరావు, పినకాన ముకుందరావు, బమ్మిడి దివాకర్, పొట్నూరు జోగారావు, మూల మల్లికార్జున్, రాపాక చిన్నారావు యాదవ్, కర్రీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ లీకేజీతో అగ్నిప్రమాదం

**- ముగ్గురికి గాయాలు**

**- సకాలంలో స్పందించిన అగ్నిమాపక శాఖ**



**కవిటి, సెప్టెంబరు 5(వార్త):** బసవ కొత్తూరు గ్రామంలో శనివారం ఉదయం పిట్ట మాధవరావు ఇంటిలో వంట గ్యాస్ సిలిండర్ లీకేజీ వలన అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న సోంపేట అగ్నిమాపక శాఖ అధికారి ఆర్. సూర్యారావు సిబ్బందితో సకాలంలో వెళ్లడంతో అతిపెద్ద ప్రమాదం తప్పింది. అప్పటికే ఈ ప్రమాదంలో పిట్ట మహాలక్ష్మి, నీలగిరి భాగ్యలక్ష్మి, పిట్ట కుమారి తీవ్ర గాయాలు కావడంతో వారిని సోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం, బరంపురం ఆసుపత్రులకు తరలించారు. ఈ ప్రమాదంలో ఇంటి పై కప్పు, గృహ పరికరాలు, ఆహార ధాన్యాలు కాలిపోయాయి. సుమారు లక్షన్నర రూపాయల ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు.

## విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మానం



**సోంపేట, సెప్టెంబరు 5 (వార్త):** సోంపేటలో విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనం 1 లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏడుగురు విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డిల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి దుద్ది వీర రాజు నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమాజానికి ఆదర్శవంతుడైన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చూపిన దిశా నిర్దేశం ఎనలేనిదని అన్నారు. సమాజానికి దిక్సూచిగా పనిచేసి జీవితాల్లో వెలుగు నింపే ఉపాధ్యాయుని గురుతర బాధ్యతలను సమాజానికి చాటిచెప్పిన మహనీయుడు రాధాకృష్ణన్ దేశానికి ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో దుద్ది కృష్ణమూర్తి, డి. గోవిందరావు, ఎ.నారాయణమూర్తి, లక్ష్మీనారాయణ, జి.శంకర్రావు, ఆర్.కుర్మారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయులు పిన్నింటి చంద్రశేఖర్, బి.గిరిధరరావు, ఎస్.కాళిదాసు, మర్ల ధనరాజు, పి.కుర్మారావు, రఘు ముని మహంతి, ఎస్.సోమేశ్వరరావు లను దుస్సాలువలు కప్పి ఘనంగా సన్మానించారు.

## సారవకోటలో బీజేపీ కార్యాలయం ప్రారంభం

**- కార్యవర్గ సభ్యుడు సింహాచలం చేతుల మీదుగా ప్రారంభం**

**- నరసన్నపేట నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి చర్యలు**

**- రోణంకి ప్రభావతితో పాటు 20 మంది పార్టీలో చేరిక**



**సారవకోట, సెప్టెంబరు 5 (వార్త):** సారవకోటలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నూతన పార్టీ కార్యాలయాన్ని కార్యవర్గ సభ్యుడు సింహాచలం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన కార్యాలయం ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ దేశ ఉన్నతి, అభివృద్ధి, సుస్థిర రాజకీయ వ్యవస్థకు బీజేపీ అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజల సంక్షేమం, దేశాభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. నరసన్నపేట నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయడంతో పాటు ప్రజలకు చేరువయ్యే విధంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రోణంకి ప్రభావతి తన 20 మంది అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. వారికి పార్టీ నాయకులు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కొత్తగా చేరిన వారు పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.




## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**- మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై పర్లాంలో ఎస్సై ఆధ్వర్యంలో అవగాహన**

**- యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడాలని పిలుపు**

**జలుమూరు, సెప్టెంబరు 5 (వార్త):** మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జలుమూరు మండలం పర్లాంలో నిర్వహించిన మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో పోలీసులు సూచించారు. పర్లాం గ్రామంలో ఎస్సై ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామస్తులు, యువతకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబ వ్యవస్థ, సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు.

ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు సమిష్టిగా అవగాహన కల్పించాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, క్రీడలు వంటి సానుకూల అంశాలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజలతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ తమ విలువైన ప్రాణాలను కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, ఎక్కడైనా మత్తు పదార్థాల వినియోగం లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసినట్లయితే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని, యువత భవిష్యత్తును కాపాడేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో పేర్కొన్నారు.

## టీడీపీ నేత ఔగాన దాతృత్వం

**-ఆలయ నిర్మాణానికి రూ.30వేలు విరాళం**

**-ఈశ్వరరావును అభినందించిన ప్రజలు**



**మందస, సెప్టెంబరు 5(వార్త):** తెలుగుదేశం పార్టీ మందస మండల యువత అధ్యక్షుడు ఔగాన ఈశ్వరరావు సమాజ, ఆధ్యాత్మిక సేవల్లో ముందుంటారు. ఎక్కడ మంచి కార్యక్రమం జరిగినా ప్రోత్సహిస్తుంటారు. మందస మండలంలోని సొండిపూడి గ్రామానికి చెందిన ఈశ్వరరావు మంచి నాయకునిగా, ఆధ్యాత్మిక వేత్త, సమాజ సేవకునిగా ఇప్పటికే గుర్తింపు తెచ్చుకున్నారు. సొండిపూడి పంచాయతీలోని బాలాజీ పురంలో శ్రీమర్రిపోలమ్మతల్లి ఆలయం పున:నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని గ్రామస్తులు ఈశ్వరరావుకు వివరించారు. దీంతో మండల తెలుగు యువత అధ్యక్షుడు ఔగాన ఈశ్వరరావు ఆలయ అభివృద్ధి పనులకు 100 బస్తాల సిమెంట్ ను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఈశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఎవరైనా దాతలు ఇలాంటి సహాయ సహకారాలు చేయడానికి ముందుకు రావాలని శ్రీశ్రీశ్రీ మర్రిపోలమ్మ తల్లి కమిటీ తరఫున మేమందరం మనస్ఫూర్తిగా కోరుకోవడం జరుగుతుందని ఈశ్వరరావు అన్నారు. అమ్మవారి సేవలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని, గ్రామం అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సొండిపూడి అధ్యక్షుడు మిస్క గణపతి, మాజీ ఎంపీటీసీ మిస్క మోహన్, పార్టీ మాజీ అధ్యక్షుడు అల్లుమల్ల నారాయణరావు, సీనియర్ నాయకులు యానాది వాసు, మద్ది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నీలమణి అమ్మవారి ఆలయంలో చండీ హోమం

**- ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమం**

**- భక్తి శ్రద్ధలతో పూజలు, అభిషేకాల నిర్వహణ**

**- చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు**

**సారవకోట, సెప్టెంబరు 5 (వార్త):** సారవకోటలోని శ్రీ నీలమణి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శనివారం భక్తి శ్రద్ధల నడుమ చండీ హోమం వైభవంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పురోహితులు మావుదూరి సంతోష్ శర్మ ఆధ్వర్యంలో భక్తులతో కలిసి చండీ హోమాన్ని నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన హోమ కార్యక్రమం భక్తులను ఆధ్యాత్మిక వాతావరణంలో ముంచెత్తింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని చండీ హోమంలో పాల్గొన్నారు. అమ్మవారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని ఆశీస్సులు పొందారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని విజయవంతం చేశారు.



## ఉపాధ్యాయుల సేవలు సమాజ నిర్మాణానికి పునాది

**- టీచర్స్ డే సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం**

**- టీచర్ల సేవలను కొనియాడిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అర్చన**

**- విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని వెల్లడి**

**నరసన్నపేట, సెప్టెంబరు 5 (వార్త):** ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పడమే కాకుండా వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నరసన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు టీచర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని, భావి తరాలను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో జ్ఞానం, క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించడంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుడి ప్రభావం చిరస్థాయిగా ఉంటుందని, విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి సరైన మార్గదర్శకత్వం అందించడం ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకునేలా చేయగలరని అన్నారు. విద్యారంగ అభివృద్ధికి ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నీటిసంగం అధ్యక్షుడు సిమచంద్రశేఖర్, అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేసి వారి సేవలను స్మరించుకున్నారు.



## అజయ్ కు పరామర్శల వెల్లువ

**కవిటి, సెప్టెంబరు 5 (వార్త):** సామాజిక కార్యకర్త, కవిటి మండలం సహలాల పుట్టుక పంచాయతీ మడియార పుట్టుక గ్రామానికి చెందిన దట్టి అజయ్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురవడంతో అతని ఇంటి వద్దకు అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పరామర్శ కు హాజరవుతున్నారు. నియోజకవర్గంలో సామాజిక కార్యక్రమాలలో ముందుండి నడిపించే అజయ్ అటు రాజకీయంగా ఇటు సామాజికంగా అనేక మందితో పరిచయాలు, స్నేహాలు, బంధుత్వాలు ఉండడంతో చాలామంది అజయ్ ఇంటి వద్దకు క్యూ కడుతున్నారు. సుమారు పది రోజుల క్రితం జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదానికి గురై అనంతరం విశాఖపట్నంలోని అపోలో ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు జరిగిన అనంతరం మూడు రోజుల క్రితం ఇంటి వద్దకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో చాలామంది ప్రముఖులు అజయ్ ను కలిసి త్వరగా ఆరోగ్యంతో కోలుకోవాలని కోరుకుంటున్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలతో నివాళులు

- మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు, పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులకు సత్కారం

- విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే మార్గదర్శకులన్న ప్రముఖులు



**నరసన్నపేట, సెప్టెంబరు 5 (వార్త):** సమాజ అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి ఎనలేనిదని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నరసన్నపేటలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ముందుగా నరసన్నపేట ఎంఆర్సీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి ఉపాధ్యాయులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంతో పాటు సమాజాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పడమే కాకుండా వారిలో మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించే బాధ్యతను ఉపాధ్యాయులు నిర్వర్తిస్తున్నారని కొనియాడారు. అనంతరం నరసన్నపేట మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పలువురిని ఘనంగా సన్మానించారు. ఇటీవల పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులను కూడా ఈ సందర్భంగా సత్కరించి వారి సేవలను గుర్తించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ ఆరంగి మురళీధర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్రకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. విద్యార్థుల జీవితాలకు సరైన దిశానిర్దేశం చేస్తూ సమాజానికి ఉపాధ్యాయులు దిక్సూచిలా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం వారి సేవా తత్పరతకు దక్కిన గుర్తింపన్నారు. ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు మాట్లాడుతూ మండలంలోని విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు ఇతర ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు తమ సుదీర్ఘ సేవా కాలంలో విద్యార్థుల అభివృద్ధికి అందించిన సేవలను వారు గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సన్మానం పొందిన ఉపాధ్యాయులను పలువురు అభినందించారు.

## గురువు సమాజ నిర్దేశకుడు

-శ్రీనివాసపురంలో రిటైర్డ్ టీచర్స్ కు ఘన సన్మానం



**మందస, సెప్టెంబరు 5(వార్త):** గురువు సమాజానికి నిర్దేశకుడని, ఉపాధ్యాయుడే జ్ఞాననేత్రమని పలువురు వక్తలు అన్నారు. మందస మండలంలోని మూలిపాడు పంచాయతీలో గల శ్రీనివాసపురంలో ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులతో పాటు ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. టీచర్స్ డే సందర్బంగా జరిగిన ఈ కార్యక్రమంలో గౌరహరిమహంతి, రామచంద్రచౌదరి, జగన్నాథచయినీ, సునీల్ మహంతి, బి.హేమరాజు, కేదార్ చౌదరి తదితరులు మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న చీకట్లును పారద్రోలే శక్తి గురువుకు మాత్రమే ఉందన్నారు. విద్యార్థి దశలో ఉపాధ్యాయులు బోధించే పాఠాలే భవిష్యత్ కు పునాదులు వేస్తాయని, మంచి మార్గంలో పయనింపజేస్తాయన్నారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయులు పి.వేణుగోపాలరావు, డి.క్రిష్ణమూర్తి, రంగనాథ్ మహంతి, సుభాష్ చంద్రపాణిగ్రాహిలతో పాటు ప్రస్తుతం పని చేస్తున్న అనిల్ కుమార్ లకు ఇరు గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. పూలమాలలు వేసి, దుశ్శాలువతో సన్మానించారు. ఈ సందర్బంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూయ టీచర్స్ డే ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చేసిన సేవలను వివరించి, సన్మానం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జరిగిన సన్మానం గొప్ప అనుభూతిగా చెపుతూ, గ్రామంతో వారికి ఉన్న స్నేహభావం గురించి గొప్పగా చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

## ఇచ్ఛాపురంలో టీచర్స్ డే వేడుకలు



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 5(వార్త):** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా టీచర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్ జే ఫంక్షన్ హాల్ లో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు లో ఏమ్మెల్సీ నర్తు రామారావు ఎంపిపి బోర పుష్ప జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండా శంకర్ రెడ్డి దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు.డిగ్రీ కాలేజీ లో ప్రిన్సిపాల్ కృష్ణ ఆధ్వర్యంలో జరిగింది.కేసుపురం లో రాష్ట్ర నాటక పరిషత్ డైరెక్టర్ దక్కత కామేశ్వరరావు పాల్గొన్నారు.జ్ఞానభారతి స్కూల్ లో సెక్రటరీ జోహార్ ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు లో వైద్యులు డాక్టర్ దేవేందర్ రెడ్డి, మట్ట శ్రీనివాసరావు పాల్గొన్నారు. పంజా వీధి స్కూల్ లో హెచ్ ఎం భాస్కరరావు ఆధ్వర్యంలో, శాంతినికేతన్ స్కూల్ లో దక్కత కృష్ణ మూర్తి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో బాల బ్రాహ్మనంద స్వామి పాల్గొన్నారు. డోంకురు లో హెచ్ ఎం హేమ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. వైస్సార్సీపీ కార్యాలయం లో దివంగత మాజీ రాష్ట్ర పతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి శ్యాం ప్రసాద్ రెడ్డి నర్తు నరేంద్ర, ఎంపిపి లు బోర పుష్ప పైల దేవదాస్ రెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉలాల భారతి దివ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్-మతతత్వ శక్తులను అడ్డుకుందాం

**పలాస, సెప్టెంబరు 5 (వార్త):** రాష్ట్రంలో కార్పొరేట్, మతతత్వ, మనువాద శక్తుల ప్రభావాన్ని అడ్డుకోవాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్య విలువలు పరిఢవిల్లే ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు ఏకం కావాలని కోరారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు ప్రజలకు నష్టం కలిగించేలా ఉన్నాయని వారు విమర్శించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి అవసరమైన మద్దతును రాష్ట్రంలోని అధికార కూటమి అందిస్తోందని ఆరోపించారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, రాయలసీమ--ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ వంటి అంశాల్లో కేంద్రం రాష్ట్రానికి న్యాయం చేయడం లేదని చెప్పారు. రాష్ట్ర హక్కులు, సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగించే విధానాలను కేంద్రం అనుసరిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించడం లేదని విమర్శించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉత్తరాంధ్ర ప్రజలు, కార్మికులు చేస్తున్న పోరాటానికి మద్దతు తెలిపారు. భూముల ప్రైవేటీకరణపై ఆందోళనతో అభివృద్ధి పేరుతో శ్రీకాకుళం నుంచి తడ వరకు పంట భూములను కార్పొరేట్, బహుళజాతి సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్గో విమానాశ్రయాలు, సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు, పారిశ్రామిక కారిడార్ల పేరుతో భారీగా భూసేకరణ చేపట్టడాన్ని వ్యతిరేకించారు. నిరుపయోగంగా ఉన్న సెజ్ భూములను తిరిగి రైతులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం సహా ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరించే చర్యలను నిలిపివేయాలని కోరారు. పీపీపీ విధానంలో వైద్య కళాశాలలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడాన్ని వారు తప్పుబట్టారు. కార్మికుల పని గంటలను పెంచే ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ హామీలు ఎక్కడ అమలపరిచారని, ఎన్నికల సమయంలో టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల్లో పలు అంశాలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన, ఇళ్ల స్థలాల పంపిణీ, టిడ్కో ఇళ్ల అందజేత, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు వంటి హామీలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ప్రజా సమస్యలపై ఇప్పటికే వివిధ వర్గాలు ఆందోళనలకు సిద్ధమవుతున్నాయని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో ప్రతిపాదిత కార్గో విమానాశ్రయానికి వ్యతిరేకంగా ఉద్యమాలు జరుగుతున్నాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా వామపక్షాలు, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు కలిసి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అన్ని ప్రజాస్వామ్య శక్తులను కలుపుకుని తృతీయ ప్రత్యామ్నాయాన్ని బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని కోరారు.





# ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనది

-ఎంఈవో ఎంవీ రమణ

- అలుదు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం

- విద్యార్థుల అభ్యున్నతి కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచన

- ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు ఘన సత్కారం

**సారవకోట, సెప్టెంబరు 5 (వార్త):** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని, ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనదని ఎంఈవో ఎంవీ. రమణ అన్నారు. ఉపాధ్యాయులు తమ బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తిస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సారవకోట మండలం అలుదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాలతో పాటు స్థానిక ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో రమణ మాట్లాడుతూ ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశాలను బోధించడానికే పరిమితం కాకుండా విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి విద్యార్థి అభ్యున్నతిని లక్ష్యంగా చేసుకుని ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందని, వారి సేవలను గుర్తించి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సన్మానించడం ఆనందదాయకమని పలువురు పేర్కొన్నారు.

కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం టంప రామారావు, చల్ల ఆనందరావుతో పాటు ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు పలాస లయన్స్ క్లబ్ ఘన సన్మానం



**పలాస, సెప్టెంబరు 5 (వార్త):** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలాస నియోజకవర్గంలో పలాస లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని పదవీ విరమణ పొందిన ఐదుగురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యారంగానికి వారు అందించిన సేవలను కొనియాడుతూ శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. 2026లో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన పలాస నియోజకవర్గానికి చెందిన పది మంది విద్యార్థులను అభినందించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా విద్యపై మరింత ఆసక్తి పెంపొందుతుందని పలాస లైన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు దున్న మధుసూదన్‌రావు, కంచరాన చిన్నబాబు, తమ్మినాన లక్ష్మీనారాయణ, పిన్నింటి కృష్ణారావు, చక్రపాణి ప్రధాన్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షుడు నంబాల కోదండరామయ్య, కార్యదర్శి తమ్మినాన మాధవరావు, కోశాధికారి నెమలపూరి అప్పారావు, సభ్యులు హెచ్.వై. దొర, బమ్మిడి నాగేశ్వరరావు, తప్పుల కృష్ణమూర్తి, టి.కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గుప్పిడిపేట పాఠశాలలో రాధాకృష్ణన్ జయంతి వేడుకలు

- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

- రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు

- క్రమశిక్షణతో చదువులో రాణించాలని విద్యార్థులకు సూచన



**పోలాకి, సెప్టెంబరు 5 (వార్త):** గుప్పిడిపేటలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన విద్యారంగానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. విద్యార్థుల జీవితాల్లో జ్ఞానమనే వెలుగును నింపి, వారి భవిష్యత్తుకు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ పేర్కొన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. ఉపాధ్యాయులు అందించే మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుపై దృష్టి సారించి అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. మంచి విద్యతో పాటు నైతిక విలువలను అలవర్చుకుని సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

# ఘనంగా గురు పూజోత్సవం

- ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌గోపాల్‌కు అధ్యాపకుల ఘన సత్కారం

**పలాస, సెప్టెంబరు 5 (వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురుపూజోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని కళాశాల ఆవరణలోని ఆయన విగ్రహానికి అధ్యాపకులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గురుదినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌గోపాల్‌ను అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ విద్యార్థుల్లో గురువుల పట్ల గౌరవభావాన్ని పెంపొందించడంలో గురుపూజోత్సవం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, భావితరాలను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో వారి కృషి ఎంతో ముఖ్యమని తెలిపారు. సన్మానానికి స్పందించిన ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌గోపాల్ మాట్లాడుతూ సహచర అధ్యాపకులు చూపిన అభిమానం తనకు ఎంతో ప్రేరణనిచ్చిందన్నారు. సన్మానం తనపై మరింత బాధ్యతను పెంచిందని, సహచరుల అభిమానాన్ని ఎప్పటికీ మరువలేనని తెలిపారు. అనంతరం పలువురు అధ్యాపకులను ప్రిన్సిపాల్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పట్నాయక్, లైబ్రేరియన్ నరసింహులు, కామర్స్ అధ్యాపకులు రమణమూర్తి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.మధు, ఫిజిక్స్ అధ్యాపకులు హేమాచలం, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు తాకేశ్వరరావు, విజయలక్ష్మి, హేమరాజు, హరిప్రసాద్, కోదండరావు, ప్రసాద్, రాజేష్, శంకరరావు, నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమాజ నిర్దేశకుడు ఉపాధ్యాయుడు

**పలాస, సెప్టెంబరు 5 (వార్త):** సమాజాన్ని సన్మార్గంలో నడిపిస్తూ, భావితరాలకు దిశానిర్దేశం చేసే మహోన్నత వ్యక్తి ఉపాధ్యాయుడని కాశీబుగ్గ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిన్నమనాయుడు అన్నారు.

శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ విద్యార్థులలో విజ్ఞానంతోపాటు విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. సమాజంలో సమూల మార్పునకు విద్యే పునాది కాగా, ఆ విద్యను భావితరాలకు అందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. మంచి సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయుల కృషి ఎంతో అవసరమని తెలిపారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయుల కోసం క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఉత్సాహపరిచారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



# పలాస ప్రగతికి అప్పయ్యదొర పునాది

- అభివృద్ధి కోసం జీవితాంతం కృషి చేసిన దివంగత నేతకు ఘన నివాళి
- ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి
- ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు



**పలాస, సెప్టెంబరు 5 (వార్త):** పలాస ప్రాంత అభివృద్ధికి దివంగత నేత, మాజీ ఎంపీ హనుమంతు అప్పయ్య దొర చేసిన సేవలు చిరస్మరణీయమని ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి, ప్రాంత అభివృద్ధి కోసం జీవితాంతం శ్రమించిన నాయకుడిగా అప్పయ్య దొర ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయారని కొనియాడారు. పలాసలో శనివారం నిర్వహించిన హనుమంతు అప్పయ్య దొర వర్ధంతి కార్యక్రమంలో వజ్జ బాబూరావు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అప్పయ్య దొరతో తనకున్న అనుబంధాన్ని, పలాస ప్రాంతం కోసం ఆయన చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. అప్పయ్య దొర రాజకీయ పదవులను ప్రజాసేవకు వేదికగా మలచుకున్న నాయకుడని బాబూరావు అన్నారు. పలాస ప్రాంతం అభివృద్ధి చెందాలన్న దృఢ సంకల్పంతో అనేక ప్రజా సమస్యలపై ఆయన పోరాడారని తెలిపారు. ముఖ్యంగా రవాణా, తాగునీరు, విద్య, వైద్యం తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపారని తెలిపారు. అభివృద్ధికి అంకురార్పణగా పలాస అభివృద్ధిలో అప్పయ్య దొర వేసిన అడుగులు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని బాబూరావు అన్నారు. ప్రజల కోసం పదవిని వినియోగించుకోవాలన్న తపన ఆయనలో స్పష్టంగా కనిపించేదని, అందుకే అప్పయ్య దొరను ప్రజలు ఇప్పటికీ అభిమానంతో స్మరించుకుంటున్నారని చెప్పారు. పలాస అభివృద్ధికి అంకురార్పణ చేసిన నాయకుడిగా ఆయన పేరు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. పెరుగుతున్న జనాభా, పట్టణీకరణకు అనుగుణంగా పలాసలో మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, సాగునీరు, విద్య, వైద్య సౌకర్యాలపై ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా దృష్టి సారించాలని సూచించారు. అప్పయ్య దొర ఆశయాలు కేవలం రాజకీయ నినాదాలుగా మిగలకుండా ఆచరణలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని బాబూరావు అన్నారు. అప్పయ్య దొర సేవలను భవిష్యత్ తరాలకు తెలియజేస్తూ, ఆయన స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాస రావు, బడ్డ నాగరాజు, అప్పయ్య దొర కుటుంబ సభ్యులు, అభిమానులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



**పలాస, సెప్టెంబరు 5 (వార్త):** విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను పెంపొందించడంలో ఉపాధ్యాయులు పాత్ర ఎంతో కీలకమని శ్రీ సత్య సాయి విద్యా విహార్ ట్రస్ట్ చైర్మన్ మల్ల రామేశం అన్నారు. రామకృష్ణపురంలోని శ్రీ సత్యసాయి విద్యావిహార్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, మరో 45 మంది ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర ఎంతో కీలకమని మల్ల రామేశం తెలిపారు. విద్యాబోధనతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను పెంపొందించడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పాఠశాలలో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలను ప్రశంసిస్తూ, భవిష్యత్ తరాలకు ఉత్తమ మార్గదర్శకులుగా నిలవాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి సహా ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

## నేత్రదానంతో ఇద్దరికి చూపు



**పలాస, సెప్టెంబరు5 (వార్త):** నేత్రదానం ద్వారా మరణించిన వ్యక్తి ఇద్దరికి చూపును ప్రసాదించవచ్చని నేత్ర వైద్యాధికారి రోణంకి వెంకటరమణ తెలిపారు. నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా కాశీబుగ్గలోని చైతన్య జూనియర్ కళాశాలలో శుక్రవారం నేత్రదాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ మరణించిన వారి నేత్రాల్లోని కార్నియాను ఆరు గంటల్లోపు సేకరించాల్సి ఉంటుందని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నేత్ర సేకరణ కార్యక్రమం జరుగుతోందని తెలిపారు. నేత్రదానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు నేత్రదానంపై అవగాహన పెంపొందించుకుని ప్రజలకు సందేశాన్ని చేరవేయాలని కోరారు. "మా దృష్టి సందేశ దాత అవ్వండి.. నేత్రదానం మనందరికీ ఆదర్శం" అనే సందేశంతో ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి రామారావు, అధ్యాపకులు రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## లింబిగాంలో ఉపాధ్యాయులకు సన్మానం




**మందస, సెప్టెంబరు 5(వార్త):** అంబుగాం పంచాయతీ లింబుగాం మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయదినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు పొందిన పిన్నింటి కొండలరావు, గున్న రాజులను పాఠశాల తరఫున ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మార్పు జగన్మోహనరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు దున్న మన్మథరావు, పూజారి తాతారావు, పత్రి నీలిమ, విద్యార్థినీ, విద్యార్థుల సమక్షంలో దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సన్మానగ్రహీతల విద్యా సేవలను అభినందిస్తూ, ఇతర ఉపాధ్యాయులకు వారు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

## నరసన్నపేటలో డ్రై డే

- పంచాయతీ కార్యాలయ పరిసరాల్లో పిచ్చి మొక్కల తొలగింపు, పారిశుధ్య పనులు
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు ఈవో విజ్ఞప్తి
- అపరిశుభ్రతతో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరిక



**నరసన్నపేట, సెప్టెంబరు 5 (వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం మధ్యాహ్నం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పంచాయతీ ఈవో జగన్మోహనరావు పర్యవేక్షణలో గ్రామపంచాయతీ సిబ్బంది కార్యాలయ ఆవరణలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. కార్యాలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈవో జగన్మోహనరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరిశుభ్రమైన వాతావరణం ఆరోగ్యవంతమైన జీవనానికి దోహదపడుతుందని తెలిపారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతో పాటు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అపరిశుభ్రత కారణంగా పలు రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుంటే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు.

## అంపురం-ఘాటీ రోడ్డు నిర్మాణం పక్కా!

- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు భరోసా

**కంచిలి, సెప్టెంబరు 5 (వార్త):** కొద్దికాలం ఊరించి ఉసూరుమనిపించిన అంపురం- ఘాటి రోడ్డు నిర్మాణం పక్కాగా జరిగి తీరుతుందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్థానిక టిడిపి నేతలకు భరోసా ఇచ్చారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం లో కంచిలి,ఇచ్ఛాపురం, కవిటి మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు శుక్రవారం విచ్చేసిన కేంద్రమంత్రి పట్ల కంచిలి మండలానికి చెందిన పలువురు నేతలు అలకబూనినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న రామ్మోహన్ నాయుడు ఎమ్మెస్ పల్లి గ్రామం వద్ద కారు ఆపించి స్థానిక నేతలతో కొద్దిసేపు రోడ్డుపైనే మాట్లాడారు. ఇక్కడికి వస్తున్న సందర్భంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్ కూడా ఇదే రోడ్డు గూర్చి ప్రస్తావన చేశారని పేర్కొన్నారు. చిన్నపాటి సాంకేతిక కారణాల వలన నిధుల మంజూరులో జాప్యం జరిగిందని తన సాయ శక్తులా ప్రయత్నించి తప్పకుండా నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని, వచ్చే ఏడాది లోపల అంపురం -ఘాటి రోడ్డు నిర్మాణం పక్కాగా జరిగేలా చర్యలు తీసుకుంటానని కేంద్రమంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెస్ పల్లి పంచాయతీకి చెందిన సీనియర్ టీడీపీ నేత కిషోర్ కుమార్ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్ది నెలల్లోనే కేంద్ర ప్రభుత్వం ఈ జిల్లాకు ప్రత్యేకంగా మంజూరు చేసిన రోడ్లలో అంపురం -ఘాటి రోడ్డు ఒకటి. కేంద్ర ప్రభుత్వం 70 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30% నిధుల మ్యాచింగ్ గ్రాంట్ తో సి ఆర్ ఐ ఎఫ్ స్కీం ద్వారా 23 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఈ రహదారిని ఆధునీకరించి సరిహద్దులో ఉన్న ఒరిస్సా ప్రాంతంతో మంచి రవాణా సౌకర్యం అనుసంధానం చేయాలన్న కూటమి ప్రభుత్వ లక్ష్యానికి ఇప్పటివరకు నిధులు రాకపోవడం అసంతృప్తిని ఏర్పరిచింది. రోడ్డు మంజూరైన సందర్భంలో ఈ ప్రాంత ప్రజలు ఎంతగానో హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం దీనిపట్ల ప్రజల్లో అనేక విమర్శలు నెలకొన్నాయి. స్థానిక ఎమ్మెల్యే అశోక్ ఇదిగో అదిగో అంటూ ఈ రహదారి నిర్మాణానికి మంజూరు కావాల్సిన నిధులు విషయంలో దాటవేత ధోరణి కనబరుస్తున్నారు. ఎట్టకేలకు కేంద్రమంత్రి వద్దనే ఈ ప్రస్తావన తీసుకురావడంతో ఆయనే స్వయంగా దీనిపట్ల శ్రద్ధ తీసుకుంటానని పేర్కొనడం విశేషం. ఈ ప్రాంత కూటమి నాయకుల్లో రామ్మోహన్ నాయుడు భరోసాతో మళ్ళీ జోష్ నెలకొంది.



## స్థానిక ఎన్నికల ఓటర్ల తుది జాబితా విడుదల

- నరసన్నపేట మేజర్ పంచాయతీ ఓటర్ల తుది జాబితా సిద్ధం
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో విడుదల
- ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ఓటర్ల వివరాలపై చర్చ

**నరసన్నపేట, సెప్టెంబరు 5 (వార్త):** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలోని ఓటర్ల తుది జాబితాను సిద్ధం చేసినట్లు పంచాయతీ ఈవో జగన్మోహనరావు తెలిపారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధుల సమక్షంలో ఓటర్ల తుది జాబితాను విడుదల చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసినట్లు ఆయన వివరించారు. పంచాయతీ పరిధిలోని ఓటర్ల వివరాలను పరిశీలించి తుది జాబితాకు రూపకల్పన చేసినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు సంబంధించిన ఓటర్ల జాబితాలు, వాటి వివరాలపై కూడా సమావేశంలో చర్చించినట్లు పేర్కొన్నారు. ఆయా వర్గాల ప్రాతినిధ్యం, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలను రాజకీయ పార్టీల నాయకుల దృష్టికి తీసుకెళ్లి వారి అభిప్రాయాలను సేకరించినట్లు తెలిపారు. సమావేశంలో ఓటర్ల జాబితాపై సమగ్రంగా చర్చించి తగు నిర్ణయాలు తీసుకున్నామని ఈవో జగన్మోహనరావు వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి తదుపరి ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా చేపడతామని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

- ఉపాధ్యాయులను సన్మానించిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన

**జలుమూరు, సెప్టెంబరు 5 (వార్త):** జలుమూరు మండలంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జలుమూరు మోడల్ ప్రైమరీ స్కూల్‌తో పాటు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) జలుమూరులో నిర్వహించిన టీచర్స్ డే వేడుకల్లో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన పాల్గొని ఉపాధ్యాయులను సన్మానించారు.

ఈ సందర్భంగా బగ్గు అర్చన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవలు సమాజ నిర్మాణంలో అత్యంత కీలకమని అన్నారు. గురువు లేని విద్య లేదని, విద్య లేని అభివృద్ధి లేదని పేర్కొన్నారు. విద్యార్థులకు కేవలం పుస్తక జ్ఞానాన్ని అందించడమే కాకుండా, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి జీవితానికి సరైన మార్గాన్ని చూపించే వారే నిజమైన గురువులని కొనియాడారు. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను స్మరించుకుంటూ ప్రతి విద్యార్థి జీవితాన్ని తీర్చిదిద్దే శిల్పి ఉపాధ్యాయుడేనని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తే, వారికి మంచి భవిష్యత్తును అందించే బాధ్యతను గురువులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేక ఒడిదుడుకులు, సవాళ్ల మధ్య కూడా పిల్లల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు చేస్తున్న కృషి వెలకట్టలేనిదని అన్నారు. వారి త్యాగం, ఓర్పు, సేవా భావం వల్లే సమాజం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని తెలిపారు. నరసన్నపేట నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి నాయకత్వంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులకు ఎటువంటి సమస్య ఎదురైనా తాము, తమ కుటుంబం అందుబాటులో ఉంటామని తెలిపారు. ఉపాధ్యాయులను గౌరవించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.

అక్షరం దిద్దించి, విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసే ప్రతి గురువుకు పాదాభివందనం చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల ఆశీస్సులు, సూచనలు ప్రజాప్రతినిధులకు ఎల్లప్పుడూ అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో బగ్గు గోవిందరావు, గంగాధర్, దత్తుబాబు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జలుమూరు కేజీబీవీలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో కూడా ఉపాధ్యాయులు, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. విద్యార్థుల అభివృద్ధి, బాలికల విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546